

డీసీఎంఎస్ చైర్మన్‌గా చౌదరి అవినాష్



ఎచ్చెర్ల, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్(పర్సన్ ఇన్‌చార్జి)గా ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురం మాజీ సర్పంచ్ చౌదరి అవినాష్‌ను నియమిస్తూ శుక్రవారం జీవో ఆర్టీ నెంబరు 366 విడుదలైంది. ఇప్పటికే ప్రభుత్వం డీసీఎంఎస్ చైర్మన్లను నియమించగా.. తాజాగా ఉత్తర్వులు విడుదల చేసింది. ఇప్పటివరకు పర్సన్ ఇన్‌చార్జిలుగా ఆయా జిల్లా జాయింట్ కలెక్టర్లు వ్యవహరించారు.

నీటి లెక్క తప్పుతోంది



మెళియాపుట్టి తహసీల్దార్ కార్యాలయంలో ఆటోమెటిక్ వెదర్ స్టేషన్

గతేడాది మెళియాపుట్టి మండలం కరజాడ ప్రాంతంలోని సుమారు పది పంచాయతీల్లో వర్షాలు లేక వరి పంటకు నష్టం వాటిల్లింది. మెళియాపుట్టిలో ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ బాగా వర్షాలు కురవడంతో మెళియాపుట్టి ప్రాంతాన్ని ప్రామాణికంగా తీసుకుని.. కరజాడ ప్రాంతంలో పంటలు నష్టపోయినా కరువు ప్రాంతంగా నమోదు చేయలేదు. దీంతో కనీస పరిహారం అందక రైతులు నష్టపోయారు. మండలం మొత్తం ఒకే ప్రామాణికంగా తీసుకోవడం వల్ల ఇటువంటి పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో పనిచేయని ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు
- వైసీపీ పాలనలో నిర్వహణకు నోచుకోని వైనం
- కేంద్రాలు పునరుద్ధరించాలని రైతుల విజ్ఞప్తి

మెళియాపుట్టి, మే 30(ఆంధ్రజ్యోతి):

నైరుతి రుతుపవనాలు రాకతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. వర్షపు నీటి ఆధారంగానే పంటలు వేస్తారు. కరువు ప్రాంతాలు లెక్కిస్తారు. బాధిత రైతులకు పరిహారం చెల్లిస్తారు. కాగా.. ఈ వర్షపునీటి లెక్క తప్పుతోంది. వర్షపు నీటి ప్రామాణికాన్ని లెక్కించేందుకుగానూ ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ల నిర్వహణను వైసీపీ ప్రభుత్వ పాలనలో గాలికొదిలేశారు. తూతూమంత్రంగా లెక్కలు వేసి.. బాధితులకు మొక్కుబడిగా పరిహారం చెల్లించారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో పాతపట్నం, హిరమండలం, టెక్కలిలో మూడు భారత వాతావరణ శాఖ ఇండియా మెథరాలజికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండీ) కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు 116 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు (ఏడబ్ల్యూఎస్) ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ప్రతీ ఐదు కిలోమీటర్లకు ఒక ఏడబ్ల్యూఎస్ ఏర్పాటు చేయాలి. కానీ జిల్లాలో మండలానికి రెండు.. మూడు మాత్రమే ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో యంత్రాలు ద్వారా గాలిలో ఉష్ణోగ్రతలు, గాలి వీచే దిశ, వేగం, భూమిలో తేమ, వర్షపాతం లెక్క అంచనా వేయవచ్చు. రోజూ ఉదయం 8 గంటలకు వర్షపాతం వివరాలు నమోదు చేస్తారు. 2.5 మిల్లీమీటర్లు కురిస్తే.. ఒక రైయినీ డేగా కొలుస్తారు. 2.4 మిల్లీమీటర్లు నమోదైనా.. వర్షం కురిసిన రోజుగా లెక్కలోకి తీసుకోరు. ఆశించినస్థాయిలో వర్షపాతం నమోదు కాని ప్రాంతాలను కరువుగా గుర్తిస్తారు. దాని ఆధారంగానే రైతులకు పంట నష్ట పరిహారం కూడా దక్కుతుంది. కాగా ప్రస్తుతం ఈ కేంద్రాల్లో యంత్రాలు సక్రమంగా పనిచేయడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణకు నిధులు మంజూరు చేయకపోవడంతో యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయి. ఇంజనీరింగ్ సిబ్బందికి కూడా సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో వీటి నిర్వహణను వదిలేశారు. దీంతో ఈ యంత్రాలు ఎక్కడ పనిచేస్తున్నాయో.. తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో తుపాన్ల సమయంలో వాతావరణంలో మార్పులను అంచనా వేసి ముందస్తు చర్యలు చేపట్టేందుకు (మిగతా 4వ పేజీలో..)



పాతపట్నంలో తుప్పల్లో ఉన్న రెయిన్ గేజ్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ కేవీ రమణ, పోలీసుల అదుపులో నిందితులు

ఈ అక్షయపాత్ర.. మహిమగలదంట!



- రైస్‌పుల్లింగ్ పేరిట మోసాలు
- పోలీసులకు పట్టుబడిన 10 మంది నిందితులు
- రూ.5లక్షలు, మూడు కార్లు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం

సరుబుజ్జిలి, మే 30(ఆంధ్రజ్యోతి): వారంతా తెలుగు రాష్ట్రాలకు చెందిన పది మంది సభ్యులు. వారు ముఠాగా ఏర్పడి.. గ్రామీణ ప్రాంతాలే లక్ష్యంగా కొంతకాలం రైస్‌పుల్లింగ్ బిట్‌కాయిన్స్ పేరిట మోసాలకు పాల్పడుతూ అమాయక ప్రజలను దోచుకుంటున్నారు. ఓ అక్షయపాత్ర(ఇత్తడి చెంబు)ను చూపించి.. అది మహిమగలదని చెబుతూ.. ఇంట్లో ఉంటే సంపద మరింత పెరుగుతుందని ఆశ చూపి.. దానిని రూ.లక్షల్లో విక్రయిస్తూ బురిడీ కొటిస్తున్నారు. కొంతకాలంగా సాగుతున్న వారి ఆటలకు ఎట్టకేలకు చెక్ పడింది. సరుబుజ్జిలి పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా వారిని పట్టుకుని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ సీహెచ్ వివేకానందతో కలిసి వెల్లడించారు. 'సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస నుంచి రిజర్వాయర్‌కు వెళ్లేదారిలో కుడివైపున పాత బంగ్లా వద్ద పురాతన రైస్‌పుల్లింగ్ అక్షయపాత్ర(ఇత్తడి చెంబు) క్రయవిక్రయాలు చేస్తున్నట్టు సమాచారం వచ్చింది. ఈ మేరకు సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి గురువారం తన సిబ్బంది తో అక్కడ వెళ్లి దాడులు చేశారు. ఆ సమయంలో ఓ అక్షయపాత్రతో బియ్యాన్ని ఆకర్షించేలా చేసి.. అది మహిమ గలదంటూ ముఠా సభ్యులు చెప్పి.. రూ.23లక్షలకు దానిని విక్రయించేందుకు బేరసారాలు చేస్తున్నారు. అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు తీసుకున్నారు. అదే సమయంలో పోలీసులు దాడులు చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ పదిమందిపై కేసు నమోదుచేసి అరెస్టు చేశాం. అక్షయపాత్రతోపాటు రూ.5లక్షల నగదు, సెల్‌ఫోన్లు, కార్లు సీజ్ చేశామ'ని ఏఎస్పీ కేవీ రమణ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన ఆమదాలవలస సీఐ పి.సత్యానారాయణ, (మిగతా 4వ పేజీలో..)

పట్టుబడిన బెట్టింగ్ ముఠాలు

- ఉదయం ఏడుగురు నిందితుల అరెస్టు.. సాయంత్రానికి బెయిల్

శ్రీకాకుళం క్రైం/రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): యువత బలహీనతను ఆసరాగా చేసుకొని.. ఆర్థికంగా నష్టం కలిగించి.. వేలాది కుటుంబాలు రోడ్డున పడేలా చేసిన బెట్టింగ్ ముఠాలను ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం ఏడుగురిని అరెస్టు చేసి.. వారి నుంచి సెల్‌ఫోన్లు, కొంత నగదుతో పాటు బెట్టింగ్ లింకులు, ఖాతాలు రాసుకున్న పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ వెంకటరమణ, డీఎస్పీ వివేకానంద వెల్లడించారు.

ఎచ్చెర్ల మండలం పొన్నాడ గ్రామంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఐపీఎల్ (క్రికెట్)లో భారీ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం ఉదయం పోలీసులు దాడి చేసి పాకల కిశోర్, కర్రి రవితేజ, బైరి ఉపేంద్ర, దున్న మన్మథరావును అరెస్టు చేశారు. వారి నుంచి ఆరు మొబైల్ ఫోన్లతో పాటు బెట్టింగ్‌కు డబ్బులు కట్టే వారి వివరాలతో కూడిన పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే శ్రీకాకుళం మండలం ఒప్పంగి గ్రామం మంత్రివీధిలో నివాసం ఉంటున్న మంత్రి ధనుంజయరావు ఇంటి వద్ద క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్టు (మిగతా 4వ పేజీలో..)



జగతిమెట్ట కాలనీ

జగతిమెట్ట ఇళ్ల కాలనీల్లో అక్రమాలు

- తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు మాయం
- తొమ్మిది మంది అధికారుల సస్పెన్షన్‌కు సిఫారసు: ఆర్డీవో కృష్ణమూర్తి

6లో

ఉద్యాన సాగుకు ప్రోత్సాహం



కొబ్బరితోటలో అంతరంగా.. ఉద్యాన పంటలు

- రైతులకు దీర్ఘకాలిక ఆదాయం లభించేలా..
- జిల్లాలో 5,978 హెక్టార్లలో సాగు లక్ష్యం
- గ్రామీణ ప్రాంతాల్లో వివిధ దశల్లో ఉపాధి

పాత శ్రీకాకుళం, మే 30(ఆంధ్రజ్యోతి)

రైతులకు దీర్ఘకాలిక ఆదాయం లభించేలా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జిల్లాలో బీడు భూములు అధికంగా ఉన్నాయి. నీటి కొరత, చాలామంది రైతులు వలసబాట పట్టడం, పెట్టుబడి పెరగడం, కూలీల కొరత వంటి కారణాలతో వ్యవసాయం చేయడం కష్టతరమైంది. ప్రస్తుతం జిల్లాలో 3,550 హెక్టార్ల బీడు భూములు ఉన్నట్లు అంచనా. ఈ భూములను ఉద్యాన పంటల (తోటల) సాగుకు వినియోగిస్తే.. ఒక్కసారి పెట్టుబడితే ఏళ్ల తరబడి దీర్ఘకాలిక ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. జిల్లాలో 2025-26 సంవత్సరానికిగాను 5,978 హెక్టార్లలో ఉద్యాన పంటల విస్తరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ప్రధానంగా సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ ద్వారా 398 హెక్టార్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా 60 హెక్టార్లు, కేంద్ర ఆయిల్ పామ్ మిషన్ ద్వారా 800 హెక్టార్లలో పామ్‌ఆయిల్ సాగు చేయనున్నారు. జాతీయ వెదురు మిషన్ కింద 10 హెక్టార్లు, పంటల వైవిధ్యీకరణ ద్వారా 100 హెక్టార్లు, ఉపాధిహామీ పథకం ద్వారా రూ.1,260 హెక్టార్లలో తోటల విస్తరణ చేపట్టనున్నారు. అదనంగా కొబ్బరి బోర్డు ద్వారా 300 హెక్టార్లలో కొబ్బరి పంట, దీనితోపాటు 3,550 హెక్టార్ల బీడు భూములను సేద్య యోగ్యంగా వినియోగించాలని అధికారులు నిర్ణయించారు.

అంతర పంటలు కూడా..

తోటల సాగు అంటే కేవలం మామిడి, జీడి, కొబ్బరి మాత్రమే కాకుండా జామ, సీతాఫలం, నిమ్మ, నేరేడు, రేగు, మునగ, గులాబీ, మల్లెపూల సాగు, ఆయుర్వేద, సుగంధ తైల మొక్కల సాగు చేయవచ్చు. ఈ పంటలు తక్కువ నీటితో పెరిగే సామర్థ్యం కలిగి.. బీడు భూములకు ఎంతో అనువుగా ఉంటాయి. పదే పదే నాట్లు వేసుకునే అవసరం లేకుండా చాలా ఏళ్ల వరకు ఆదాయం వస్తుంది. వార్షిక పంటలు వేశాక ఆదాయం రావడానికి రైతుకు సమయం పడుతుంది. దీని నుంచి బయటపడేందుకు కూరగాయలు, బొప్పాయి, అరటితోపాటు పసుపు, అల్లం వంటి అంతర పంటలను పండిస్తే అదనపు ఆదాయం పొందవచ్చు. తోటల సాగు వలన గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. మొక్కల పెంపకం, కోత, నిల్వ, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ వంటి వివిధ దశల్లో ఉపాధి లభిస్తుంది.

బీడు భూములు.. సస్యశ్యామలం

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో క్లస్టర్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, శీతలీకరణ గదులు ఏర్పాటు చేసి రైతులకు మార్కెట్ లింకేజీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రైతులు పంటలను నిల్వ చేసుకునేందుకు ఈ శీతలీకరణ గదులు ఉపయోగపడతాయి. వ్యవసాయ రంగంలో స్థిరమైన అభివృద్ధితో బీడు భూములను బంగారు భూములుగా మార్చుకునేందుకు అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం 90శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్‌కు స్ప్రింకర్లను అందజేస్తోంది. దీని ద్వారా నీటిని 60 నుంచి 80 శాతం ఆదా చేసుకుని (మిగతా 4వ పేజీలో..)



వ్యాన్‌లో తరలిస్తున్న ఆవులు

దారుణంగా కుక్కేసి.. అక్రమ రవాణా

- బుడుమూరు వద్ద తొమ్మిది ఆవులతో వ్యాన్ సీజ్

5లో

జీవితాలకు 'పొగ'

- జిల్లాలో పెరుగుతున్న నోటి క్యాన్సర్ బాధితులు
- ఖైనీ, సిగరెట్లతో ముప్పు
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

4లో

తడ'బడి'తే కష్టం

- మంచి బడిని ఎంచుకోండి
- ఆర్భాటాలు చూసి మోసపోవద్దు

4లో

షట్టర్లు ఇలా.. సాగు నీరు ఎలా?

- మరమ్మతులకు రైతుల ఎదురుచూపు

5లో



'అంతిమ' కష్టాలు

కంచిలి, మే 30(ఆంధ్రజ్యోతి): కంచిలిలోని ఎస్ఆర్‌సీ పురం, ఎస్ఆర్‌సీ పురం కోలనీ, కంచిలి మెయిన్ రోడ్డు ప్రాంతవాసులకు శ్మశానవాటిక కష్టాలు తప్పడం లేదు. ఈ ప్రాంతాల్లో ఎవరైనా చనిపోతే అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు రైల్వేపట్టాలు దాటి, ఎస్ఆర్‌సీపురంలోని శ్మశానవాటికకు వెళ్లాల్సిందే. శుక్రవారం ఇటువంటి ఘటనే జరగ్గా.. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడ్డారు. పట్టాలు దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

జీవితాలకు పొగ



- జిల్లాలో పెరుగుతున్న నోటి క్యాన్సర్ బాధితులు
- ఖైనీ, చుట్ట, బీడీ, సిగరెట్లతో ముప్పు

నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

శ్రీకాకుళం, మే 30(ఆంధ్రజ్యోతి):

పొగాకు.. హాయిగా సాగే మనిషి జీవితంలో మంటలు రేపుతోంది. సరదాగా ఒకసారి మొదలు పెట్టిన ధూమపానం వ్యసనంగా మారి చివరకు ప్రాణాలను బలిగొంటోంది. నేడు యువత నుంచి వృద్ధుల వరకూ ఖైనీ, గుట్కా, పాన్‌తో పాటు బీడీ, చుట్ట, సిగరెట్లు కాల్చుతున్నారు. ఇవి మనిషికి మత్తును, ఉద్రేకాన్ని కలిగిస్తూ, తాత్కాలిక ఆనందాన్నిస్తున్నాయి. మరోవైపు దీర్ఘకాలికంగా క్యాన్సర్ వ్యాధి బారిన పడేస్తున్నాయి. క్యాన్సర్ కారకాలు గల పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టమేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం. ఈ సందర్భంగా దీని వల్ల కలిగే అనర్థాలను పరిశీలిస్తే..

సరదాగా మొదలై..

పొగాకు సంబంధిత ఉత్పత్తులను మొదట సరదా కోసం మొదలు పెడతారు. ఆ తరువాత అది వ్యసనంగా మారి చివరకు ప్రాణాంతకంగా మారుతోంది. వ్యసనానికి బానిసైన వ్యక్తి తనకు వచ్చే వేతనంలో 70 శాతం పొగాకు సంబంధిత ఉత్పత్తులకే ఖర్చు పెడుతున్నారన్నది అంచనా. జిల్లాలో నెల నెలా రూ.కోట్ల విలువైన పొగాకు ఉత్పత్తులు అమ్ముడవుతున్నట్లు ఓ అంచనా. సిగరెట్ పొగలో విషపూరితమైన నికోటిన్, కార్బన్ మోనాక్సైడ్, ఆర్సనిక్, బెంజిన్, అమ్మోనియా, రేడాన్, ఫార్మాల్డిహైడ్ తదితరరసాయనాలు ఉంటాయి. వీటి కారణంగా 25 రకాల జబ్బులు సంక్రమిస్తాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) తెలిపింది. దీని వల్ల ఎక్కువగా నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారు.

పొగ పీల్చినా నష్టమే..

నేరుగా సిగరెట్ కాల్చేవారికి వచ్చే జబ్బులన్నీ దాదాపుగా వారి పక్క నుంచి పొగ పీల్చే వారికీ (పాసివ్ స్మోకర్స్) వస్తాయి. పొగ తాగడం వల్ల కలిగే అనర్థాలపై అధ్యయనాలు ఏం చెబుతున్నాయంటే..

● సాధారణ వ్యక్తులతో పోలిస్తే ఇంట్లో పొగ తాగేవారి పక్కన ఉండేవారికి ఊపిరితిత్తులు, క్యాన్సర్, హృదయ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం 25 శాతం ఎక్కువ. ● పొగ తాగేవారి పక్కన మీరు 30 నిమిషాలు ఉంటే మీ గుండెకు రక్తప్రసరణ వేగం మందగిస్తుంది. ● కళ్లలో మంట, నీరు కారడం, తలనొప్పి, దగ్గు, నీరసం ఇలాంటి ఇబ్బందులెన్నో ఎదురవుతాయి. ● అప్పుడప్పుడు సరదాగా సిగరెట్ తాగిన వారికి కూడా ఊపిరితిత్తుల సామర్థ్యం దెబ్బతింటుంది. ● ఉబ్బసం రోగులు ఊపిరి పీల్చుకోలేక ఇబ్బందులకు గురవుతారు. పిల్లలు, వృద్ధులకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. ● పిల్లల్లో నేర్చుకునే ఆసక్తి సన్నగిల్లుతుంది. ఉత్సాహం కొరవడుతుంది. ఎదుగుదలపై కూడా ప్రభావం చూపుతుంది. ● చెవి సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, ఎలర్జీలకు ఆస్కారం ఉంటుంది.

అనర్థాలు ఇవే..

- సిగరెట్, బీడీ, చుట్టలకు సంబంధించిన పొగ తాగడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుంది. ఇవి ఊపిరితిత్తుల కణాలను దెబ్బతీస్తాయి.
- గుండెపోటు, అధిక రక్తపోటు, పక్షవాతం వంటి సమస్యలు వస్తాయి.
- పొగ తాగేవారిలో నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్ వచ్చే ప్రమాదం అధికంగా ఉంది.
- ఖైనీ, నమిలే పొగాకు వల్ల నోటి క్యాన్సర్ వస్తుంది.
- నోటి లోపలి భాగంలో చిగుళ్ల, నాలుక, పెదవులపై క్యాన్సర్ కణాలు ఏర్పడతాయి
- నోటి లోపలి భాగంలో మృదువైన కణజాలం గట్టి పడడంతో నోరు తెరవడం కష్టమవుతుంది.
- దంతాలపై ఎనామిల్ క్షీణించడం, దంత క్షయం, చిగుళ్ల వ్యాధులు, దంతాలు ఊడిపోవడం.
- నోట్లో పుండ్లు, చిగుళ్ల రక్తస్రావం జరుగుతుంది.
- పొట్టలో అల్సర్లు, జీర్ణాశయ సమస్యలు ఉత్పన్నమవుతాయి.

నకిలీ సిగరెట్లు కూడా..

ఇదిలా ఉంటే అసలుకు ధీటుగా తయారైన నకిలీ సిగరెట్లు మార్కెట్‌ను శాసిస్తున్నాయి. జిల్లాను ఆనుకొని ఉన్న ఒడిశా నుంచి లక్షలాది రూపాయల విలువైన సిగరెట్లు రాష్ట్ర సరిహద్దులను దాటి జిల్లాకు చేరుతున్నాయి. అసలుకు ధీటుగా ఉండే వీటిని హక్కుదారులు సైతం గుర్తు పట్టలేనంతగా తయారు చేస్తున్నారు. దుకాణదారులు తక్కువ ధరకు తెచ్చి... నిజమైన కంపెనీల ధరలకే అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి సిగరెట్ల పొగ పీల్చడం వల్ల మరింతగా ఆరోగ్యం క్షీణిస్తుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

తీవ్ర దుష్ప్రభావాలు..



పొగాకు ఉత్పత్తులైన సిగరెట్లు, చుట్టలు, బీడీలు తీసుకోవడం వల్ల శరీరంలో తీవ్రమైన దుష్ప్రభావాలు ఏర్పడతాయి. బీడీలలో సాధారణ సిగరెట్ల కంటే మూడు నుంచి ఐదు రెట్లు ఎక్కువ నికోటిన్, టార్, కార్బన్ మోనాక్సైడ్ ఉంటాయి. సిగరెట్లు, బీడీలు, చుట్టలు ఊపిరితిత్తులు, గుండె, నోరు, గొంతు.. ఇతర అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. గుండె జబ్బులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, ఉదరకోశ క్యాన్సర్, దీర్ఘకాలిక బ్రోన్కైటిస్ వంటి తీవ్రమైన అనారోగ్యాలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీపై అవగాహన పెంచుకోవాలి. ఇది పొగ తాగాలనే కోరికను తగ్గించి.. ఉపసంహరణ లక్షణాలను నిర్వహించడానికి సహాయపడుతుంది. మంచి వైద్యులను సంప్రదించి పొగ తాగే అలవాటును మానుకునేందుకు సలహాలు స్వీకరించడం మంచిది.

-డాక్టర్ కింజరాపు షర్మిల, శ్రీకాకుళం

ఏదీ ప్రచారం?

బహిరంగ ప్రదేశాలలో పొగ తాగకూడదు అనే బోర్డులు కొన్నాళ్ల మన అధికారులూ ఏర్పాటు చేశారు. అవి గోడలకే పరిమితమయ్యాయి. ప్రారంభ రోజుల్లో జరిమానా అంటూ హడావుడి చేసి... ఆపై మరిచిపోవడం మన అధికారుల వంతైంది. ప్రతిచోటా ఇష్టారాజ్యంగా పొగబాబులు పొగను విరజిమ్ముతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. పొగ తాగేవారిని ప్రశ్నించే వారికి ఛీత్కారాలు ఎదురవుతున్న సంఘటనలూ ఉంటున్నాయి.

నీటి లెక్క తప్పుతోంది

(మూడో పేజీ తరువాయి)

అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పాతకాలం నాటి రెయిన్‌గేజ్‌లపైనే ఆధారపడి వర్షపాతం లెక్కలు వేస్తున్నారు. దీని ఆధారంగా పంట నష్ట పరిహారాన్ని అందజేస్తున్నారు. కాగా.. ఈ లెక్కలు సరిగా లేక చాలామందికి పరిహారం అందడం లేదనే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. యంత్రాల మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షపాతం వివరాలను మండలం ప్రామాణికంగా కాకుండా.. ప్రాంతాల వారీగా తీసుకుని లెక్కకడితే బాధితులకు న్యాయం జరుగుతుందని పేర్కొంటున్నారు.

● ఈ విషయమై మెళియాపుట్టి ఏఎస్‌వో మనోహర్‌రావు వద్ద ప్రస్తావించగా.. 'ఐఎండీ ఏర్పాటు చేసిన ఇంజనీర్లకు గతంలో సకాలంలో జీతాలు అందక రావడం లేదు. నిర్వహణకు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం దృష్టికి మరోసారి సమస్యను తీసుకెళ్తామ'ని తెలిపారు.

పరిహారం అందడం లేదు..



ఏటా వర్షాలు లేక పంటలు పోతున్నా ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందడం లేదు. మండల యూనిట్‌గా వర్షపాతం వివరాలు నమోదు చేయడం వల్ల.. చాలామంది రైతులు నష్టపోతున్నారు.

-పదనాపురం కృష్ణారావు, రైతు, దీనబంధుపురం

కరువు ప్రాంతంగా గుర్తింపు లేదు..



రెండేళ్లుగా నీరు లేక వరి పంటలు ఎండిపోయినా కరువు ప్రాంతంగా గుర్తించడం లేదు. మెళియాపుట్టిలో అధికంగా వర్షాలు కురిశాయి. మా ప్రాంతంలో మాత్రం ఆశించినస్థాయిలో కురవకపోయినా.. మెళియాపుట్టి కేంద్రంలో వర్షపాతాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ప్రతీ ఐదుకిలోమీటర్లకు ఒక రైన్ గేజ్ ఏర్పాటు చేయాలి.

-షణ్ముఖరావు, రైతు, చీపురుపల్లి

300 మంది క్రీడాకారులతో యోగా

శ్రీకాకుళం స్పోర్ట్స్, మే 30 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, ఆయుష్ విభాగం సంయుక్తంగా శుక్రవారం 300 మంది క్రీడాకారులతో యోగా నిర్వహించాయి. స్థానిక 80 అడుగుల రోడ్డులో ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయించారు. ఈ కార్య క్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డా.కె.శ్రీధర్, ఆయుష్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ జగదీష్, క్రీడల కోచ్‌లు ఎల్.రాజశేఖర్, డి.లక్ష్మణరావు, బి.గోవిందరావు, పి.ఎస్.మణికుమార్, కె.హరికృష్ణ, ఎల్.అనీల్‌కుమార్, ఎం.ఉమామహేశ్వరావు, ఎస్.సింహాచలం, జి.అర్జున్ రెడ్డి, ఐ.అప్పన్న, పి.చంద్రశేఖర్, జి.శ్రీనివాసరావు, సెట్‌శ్రీ సీఈవో బి.వి. ప్రసాదరావు, యోగా శిక్షకులు మురళీకృష్ణ, శేఖర్, మురళీధర్ పాల్గొన్నారు.



యోగసనాలు వేస్తున్న క్రీడాకారులు

ఘనంగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

పొందూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): బి.కంచరాం గ్రామంలో నిర్మించిన సుబ్రహ్మణ్య సహిత అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సూర్యనమస్కారాలు, కుంకుమ పూజలు చేశారు. ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన చేశారు.



పూజలలో పాల్గొన్న భక్తులు

ఉద్యాన సాగుకు ప్రోత్సాహం

(మూడో పేజీ తరువాయి)

బీడు భూములను సస్యశ్యామలం చేసుకోవచ్చు. అలాగే ఉపాధిహామీ పథకంలో భాగంగా సన్న, చిన్నకారు రైతులు.. తమ పొలంలో నీటి కుంటలను ఏర్పాటు చేసుకుని, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోంది.

● ఆర్థిక భద్రతే.. లక్ష్యం



బీడు భూముల్లో ఉద్యాన పంటలను ప్రోత్సహించి.. జిల్లాలో రైతులకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యం. ప్రభుత్వం తరపున రైతులకు సహాయ సహకారాలు అందిస్తాం. ఉద్యాన సాగులో సలహాలు, సూచనల కోసం అధికారుల సేవలను వినియోగించుకోవాలి. గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలు మెరుగుపడాలి.

-రత్నాల వరప్రసాద్, జిల్లా ఉద్యానవన అధికారి

ఈ అక్షయపాత్ర.. మహిమగలదంట!

(మూడో పేజీ తరువాయి)

ఎస్‌ఐ ఎస్.బాల రాజు, సరుబుజ్జిలి ఎస్‌ఐ బి.హైమావతి, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

నిందితులు వీరే..

జిల్లాకు సంబంధించి రణస్థలం మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన పూని భద్రయ్య, పూణేరాజు, నరసన్నపేట మండలం కిల్లాడ గ్రామానికి చెందిన నెక్కిన రఘునాథరావు, ఎల్.ఎన్.పేట మండలం బొర్రంపేట గ్రామానికి చెందిన కుప్పిలి భాస్కరరావును పోలీసులు అరెస్టు చేశారు. వీరితోపాటు విశాఖపట్నంలో మధురవాడకు చెందిన పచ్చితల రవిశంకర్, రుద్రరాజు వెంకట రంగరాజు, పెద్దగంట్యాడకు చెందిన రౌతు కనకరాజు, తిరుపతి జిల్లా చెట్టివారిపాలెం గ్రామానికి చెందిన గట్టిక్కల మురళీకృష్ణ, హైదరాబాద్‌కు చెందిన గరికి శ్రీను, పీఠాపురానికి చెందిన కొండ శ్రీ వెంకటనాగ సత్యనారాయణను కూడా రైస్‌పుల్లింగ్ కేసులో అరెస్టు చేశారు. వీరందరూ వ్యక్తిగత పూచీకత్తుపై శుక్రవారం సాయంత్రం స్టేషన్ బెయిల్ పొందారు. ఇదిలా ఉండగా సరుబుజ్జిలి సమీపంలో రైస్ పుల్లింగ్ ముఠా సంచరిస్తున్న విషయం బయట పడడంతో గ్రామీణప్రాంత వాసులు ఉలిక్కిపడ్డారు. జిల్లాలోని ఎల్ఎన్‌పేట, నరసన్నపేట, రణస్థలం మండలాలతో పాటు విశాఖ, కాకినాడ, తిరుపతి, హైదరాబాద్ మహా పట్టణాలకు చెందిన వ్యక్తులు కూడా ఇక్కడ ముఠాగా ఏర్పడి ఇటువంటి చర్యలు చేపడుతున్నారా? అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పట్టుబడిన బెట్టింగ్ ముఠాలు

(మూడో పేజీ తరువాయి)

వచ్చిన సమాచారంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో మంత్రి ధనుంజయరావు, దయాల శ్రీనివాసరావు, సంగీత లక్ష్మి(శ్రీనివాసరావు భార్య)ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ఐదు మొబైల్ ఫోన్లు, రూ.8,500 నగదు, బెట్టింగ్ లావాదేవీలు జరిపిన పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. ఒప్పంగి బెట్టింగ్ బ్యాచ్‌లో కీలకంగా ఉన్న శ్రీకాకుళం పట్నంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉంటున్న రొక్కం స్వాతినాయుడు అలియాస్ తనూజ్ పరారీలో ఉన్నారు.

సాయంత్రానికి బెయిల్..

ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసి వారి జీవితాలతో బెట్టింగ్ ఆడేస్తున్న ముఠాలను చాకచక్యంగా పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టారు. బెట్టింగ్ రాయుళ్లు బెయిల్ కోసం కోర్టులో విన్నవించుకోగా స్టేషన్ బెయిల్ పొందవచ్చునని న్యాయాధికారి సూచించారు. దీంతో బెట్టింగ్ రాయుళ్లు తమ సొంత పూచీకత్తుపై స్టేషన్ బెయిల్ పొందారు.

తడబడితే కష్టం



విశాలమైన మైదానంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల

పాఠశాల... విద్యను మాత్రమే కాదు. విద్యార్థికి శారీరక... మానసిక వికాసాన్ని అందించే కార్యశాల. ఒకప్పుడు ఐదేళ్లు నిండితే గానీ పిల్లలకు పాఠశాల ఎలా ఉంటుందో తెలిసేది కాదు. కానీ ఇప్పుడు రెండున్నరేళ్లకే పలకా బలపాలు పట్టుకొని పిల్లలు బడి బాట పడుతున్నారు. పిల్లాడికి రెండో ఏడు వచ్చినప్పటి నుంచే తల్లిదండ్రులు మంచి పాఠశాల ఏదో తెలుసుకునే ప్రయత్నాలు మొదలు పెడుతున్నారు. అదే సమయంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఆకర్షణీయమైన స్కీములు... ఫీజు రాయితీలు తెరమీదకు తెస్తున్నాయి. తల్లిదండ్రులు ఈ రాయితీల వలలో పడకుండా... తడబాటు లేకుండా... పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే పాఠశాలలను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

- మంచి బడిని ఎంచుకోండి
- ఆర్భాటాలు చూసి మోసపోవద్దు
- విద్యార్థి వికాసానికి వాతావరణం ఎంతో కీలకం
- తల్లిదండ్రులూ... ఆలోచించండి



నరసన్నపేట, మే 30(ఆంధ్రజ్యోతి)

..వేసవి సెలవులకు ముందు నుంచే ప్రైవేటు పాఠశాలలు మొదలు పెట్టిన ప్రచారమిది. త్వరలో సెలవులు ముగుస్తున్నాయి. బడులు తెరచుకోనున్నాయి. ఇంతవరకూ ఫోన్లలో తల్లిదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నం చేసిన ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రస్తుతం ఇంటింటి ప్రచారం మొదలుపెట్టాయి. నేరుగా తల్లిదండ్రులను కలసి...పిల్లలను తమ బడుల్లో చేర్పించాలని కోరుతున్నాయి. గ్రామీణుల్లో ఆంగ్లంపై పెరుగుతున్న మోజును సొమ్ము చేసుకునేందుకు ప్రైవేటు విద్యాసంస్థలు దృష్టి పెడుతున్నాయి. ఈ ప్రచార ఆర్భాటాలను చూసి అంతా బాగుందన్న నమ్మకంతో వాటిలో ప్రవేశాలకు తల్లి దండ్రులు మొగ్గు చూపు తున్నారు. తీరా పిల్లలను చేర్పించాక వాతావరణం బాగాలేదని.. సౌకర్యాలు సరిగా లేవని బాధ పడుతుంటారు. పిల్లలను మంచి విద్యార్థులుగానే కాదు.. ఉత్తమ వ్యక్తులుగా సమాజానికి అందించేందుకు తోడ్పడే పాఠశాలలను ప్రాథమిక దశలోనే ఎంచుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

● 'మా పాఠశాలలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యనందిస్తాం.'
...ఓ కార్పొరేట్ పాఠశాల ప్రకటన.

● మా పాఠశాలలో చదివే విద్యార్థులకు ఫీజు రాయితీ ఇస్తాం. మీరు మొత్తం ఫీజు చెల్లించనవసరం లేదు.
...ఓ ప్రైవేటు పాఠశాల భరోసా.

● అంతంత మాత్రంగా సౌకర్యాలు..

జిల్లాలో చాలా వరకు ప్రైవేటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఇరుకు గదులు, వెలుతురు, గాలి, రక్షిత నీరులేక విద్యా ర్థులు అవస్థలు పడుతున్నారు. అందుకే ప్రవేశాల సమ యంలోనే విద్యాసంస్థల పరిస్థితి.. విద్యాప్రమాణాలను గమనించాలి. మంచి బడిలో చేర్పిస్తే విద్యార్థుల చదువులకు ఢోకా ఉండదు. అందుకు ముందుగా తల్లిదండ్రులకు అవగాహన ఎంతో అవసరం.

● ప్రకృతి నిలయాలుగా...

పాఠశాలలు ప్రకృతి నిలయాలుగా విలసిల్లితేనే విద్యార్థి మనోవికాసం, సర్వతోముఖాభివృద్ధి, సృజనాత్మక నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. ఆ దిశగానే శాంతినికేతన్ విద్యాలయాన్ని స్థాపించి విద్యపట్ల తనకున్న అభీష్టాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రకృతికి దూరంగా కొనసాగుతున్నాయి. పోటీ ప్రపంచంలో చదువులు యాంత్రికంగా తయారవుతున్నాయి. ఫలితంగా విషయ పరిజ్ఞానం తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ప్రకృతిలో గడిపేలా చేసే పాఠశాలలను తల్లిదండ్రులు ఎంచుకోవాలి. ప్రకృతిని చూపి మనసు పులకిస్తుంది. ఆహ్లాదకర వాతావరణంలోనే కొత్త ఆలోచనలు మొగ్గ తొడుగుతాయి. పాఠశాల ప్రాంగణంలో పచ్చదనం, చల్లదనం ఉంటే చదువుపై విద్యార్థిలో ఆసక్తి పెరుగుతుంది. తద్వారా సృజనాత్మక నైపుణ్యం పెంపొందుతుంది. గాలి, రక్షితనీరు, విశాలమైన ఆటస్థలం ఉంటేనే ఆరోగ్యం బాగుంటుంది. చదువుపై శ్రద్ధ పెట్టాలంటే శరీరం సహకరించాలి. కొంత మంది పిల్లలకు చిన్నవయసులోనే చూపు సమస్య ఏర్పడుతుంది. కీళ్ల నొప్పులు, ఇతర రుగ్మతలు వస్తుంటాయి. ఇలాంటివి రాకుండా ఉండాలంటే నిత్యం పాఠశాలలో శారీరక వ్యాయామం చేయించాలి.

ఇవీ నిబంధనలు..

- విద్యారంగంలో పోటీతత్వం పెరిగిపోవడంతో నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాలల యాజమాన్యాలు కొన్ని నియమ, నిబంధనలు పాటించాల్సి ఉంది.
- తరగతి గదిలో 30-40 మంది విద్యార్థులు మాత్రమే ఉండేలా చూడాలి.
- ఒక్కొక్క విద్యార్థి కూర్చొనేందుకు 9 చదరపు అడుగుల స్థలం తప్పనిసరిగా కల్పించాలి.
- ప్రతి పాఠశాలకు కనీసం సువిశాలమైన మైదానం ఉండాలి.
- విద్యాబోధనకు నల్లబల్లలే కాకుండా ఆహ్లాదంగా కనిపించే బూడిద, ఆకుపచ్చరంగు బల్లలు ఏర్పాటు చేయాలి.
- అర్హత ఉన్న ఉపాధ్యాయులనే నియమించుకోవాలి.
- మరుగుదొడ్లు, రక్షిత మంచినీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి.

తల్లిదండ్రులు ఏం చేయాలంటే..

- పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు, అర్హతలు, వారి సామర్థ్యాలు తెలుసుకోవాలి .
- ఇప్పటికే ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, పాఠశాల గురించి ఆరా తీయాలి.
- చదివే విద్యార్థుల సంఖ్య కంటే నాణ్యమైన విద్య ముఖ్యమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.
- విద్యార్థులకు ఇచ్చే బండెడు హోమ్‌వర్క్ కంటే వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు చేపడుతున్న చర్యలేంటో తెలుసుకోవాలి.

ఆర్టీసీ సిబ్బంది తీరుపై మహిళల నిరసన



బస్సు ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న దృశ్యం

ఆమదాలవలస, మే 30 (ఆంధ్రజ్యోతి): లొద్దలపేట గ్రామానికి చెందిన మహిళలు, విద్యార్థులు ఆర్టీసీ సిబ్బంది తీరుపై శుక్రవారం రాత్రి నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రతిరోజూ రాత్రి ఏడు గంటల సమయంలో శ్రీకాకుళం నుంచి తాడివలస గ్రామానికి ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు లొద్దలపేట గ్రామం మీదుగా వెళ్తుంది. ఈ క్రమంలో శుక్రవారం తాడివలస వెళ్తున్న ఆర్టీసీ బస్సులో లొద్దలపేట గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు, విద్యార్థులు శ్రీకాకుళం ఎక్కారు. అయితే ఈ బస్సు లొద్దలపేట గ్రామానికి వెళ్లకుండా, ఆ గ్రామ జంక్షన్‌లో వారిని బలవంతంగా దించేశారు. దీంతో చిమ్మచీకటిలో బిక్కుబిక్కుమంటూ గ్రామానికి చేరుకుని జరిగిన విషయాన్ని గ్రామస్థులకు తెలిపారు. దీంతో గ్రామానికి చెందిన కొంతమంది ప్రయాణికులతో జంక్షన్‌కు చేరుకున్నారు. తాడివలస వెళ్లిన బస్సు తిరిగి వస్తుండగా.. తమ గ్రామం వద్ద అడ్డుకుని నిరసన తెలిపారు. బస్సు ముందు బైఠాయించిన నినాదాలు చేశారు. ఇప్పటికైనా సిబ్బంది తీరు మారకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

దారుణంగా కుక్కేసి.. అక్రమ రవాణా

- బుడుమూరు వద్ద తొమ్మిది ఆవులతో వ్యాన్ సీజ్

లావేరు, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూగజీవాల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇరుకైన వాహనాల్లో కుక్కేసి తరలించేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ నెల 25న అక్రమంగా తరలిస్తున్న పశువుల వ్యాన్లన నవభారత్ జంక్షన్ జాతీయ రహదారి వద్ద ఎచ్చెర్ల పోలీసులు పట్టుకున్నారు. నారాయణవలస నుంచి అలమండకు తరలిస్తున్న 12 ఆవులతో ఓ వ్యాన్, 6 గేదెలతో మరో వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని కొత్తవలస గోశాలకు తర లించారు. తాజాగా శుక్రవారం నరసన్నపేట నుంచి విశాఖ వైపు తొమ్మిది ఆవులతో వెళ్తున్న వ్యాన్‌ను బుడుమూరు వద్ద లావేరు పోలీసులు అడ్డుకుని సీజ్ చేశారు. నరసన్నపేట పరిసర ప్రాంతాల్లో వాటిని కొనుగోలు చేసి తరలిస్తున్నట్టు గుర్తించామని ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం కోరేపురాళ్ల గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ పి.నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

4న దేవాలయ భూముల కౌలుకు వేలం

బూర్జ, మే 30(ఆంధ్రజ్యోతి): తోటవాడ గ్రామానికి చెందిన కేశవ స్వామి దేవస్థానానికి చెందిన ఆ గ్రామ పరిధిలో గల 13.98 ఎకరాల భూమి, చెరువు, తాటిచెట్లు తదితర వాటిపై మూడేళ్ల కాల పరిమితి హక్కులపై జూన్ 4న టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు కార్యనిర్వహణాధికారి తమ్మినేని రవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ఆ రోజు ఉదయం 10.30 గంటలకు గ్రామంలోని ఆలయం వద్ద నిర్వహించనున్నట్టు తెలిపారు.

12 నుంచి న్యాయవాదులకు శిక్షణ

శ్రీకాకుళం లీగల్, మే 30(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు జూన్ 12 నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తంగి శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్, దామోదరం సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. విశాఖలో జరగనున్న ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లాకు చెందిన న్యాయవాదులు తప్పనిసరిగా హాజరుకావాలని.. ముందుగా తమపేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం



ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస, మే 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు మేరకు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్టు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మొదలవలస రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం ఆవరణలో టీడీపీ నాయకులు నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీవీ రమణమూర్తి, విశ్వనాథం, జ్యోతి, గౌరీపతి, తమ్మినేని శ్రీనివాసరావు, బెవర లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల మరమ్మతులకు నిధులు

ఆమదాలవలస, మే 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పొందూరు, బూర్జ మండలాల్లో ఉన్న మోడల్ పాఠశాల మరమ్మతులకు నిధులు మంజూరైనట్టు టీడీపీ కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు ఒక్కో పాఠశాల మరమ్మతులకు రూ.15 లక్షలు చొప్పున మంజూరైనట్టు తెలిపారు. .

ఫ్రాన్స్‌లో నృత్య ప్రదర్శన



శ్రీకాకుళం కల్చరల్, మే 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళానికి చెందిన శివశ్రీ నృత్య నికేతన్ కళాకారులు శ్రీకాంత్ బృందం ఆధ్వర్యంలో ఫ్రాన్స్‌లో శుక్రవారం నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. రామకౌండిన్య, అన్నా నేహా థామస్, గాయత్రి వర్షిత, నేహా పట్నాయక్, చాందిని, లలిత పాల్గొన్నారు.

షట్టర్లు ఇలా.. సాగు నీరు ఎలా?

- మరమ్మతులకు ఎదురుచూపు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



వమరవల్లి కూడలి వద్ద విరిగిపోయిన సాగునీటి కాలువ షట్టర్లు



బూరవల్లి వద్ద శాలిహుండం కాలువ షట్టర్ల దుస్థితి

గార, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే వివిధ కాలువలపై దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన షట్టర్లు పాడైపోయాయి. సరైన నిర్వహణ లేక మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నాయి. మండలంలో సుమారు 16 వేలు ఎకరాలకు సాగునీరు అందించే బైరి కాలువకు అనుబంధంగా ఉన్న శాలిహుండం వమరవల్లి కళింగపట్నం, బూరవెల్లి, అంబళ్లవలస, తోణంగి మొదలైన ప్రాంతాలకు సాగునీరు అందించే పిల్ల కాలువలకు నీరు వెళ్లేలా ఏర్పాటు చేసిన ఈ షట్టర్లు పూర్తిగా పాడైపోయాయి. ఫలితంగా ఖరీఫ్ సీజన్‌లో కాలువలోకి నీరు చేరే సమయంలో షట్టర్లు పాడైపోయిన చోట నీరు వృథాగా కిందికి వెళ్లిపోతుంది. దీంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందిపడుతున్నారు. కొన్నిచోట్ల పాడైపోయిన షట్టర్లు వద్ద ఇసుక బస్తాలు, గడ్డితో కప్పి నీరు వృథాగా కిందకి పోకుండా తమ పొలాలకు మళ్లించుకుంటున్నారు. ఈ షట్టర్లను మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోతుందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైయినా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి పాడైన షట్టర్లకు మరమ్మతులు చేయించి ఖరీఫ్‌లో సాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

సాగునీటి కాలువలు వద్ద రిపేర్లకు గురైన షట్టర్లు మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నాం. ఖరీఫ్ సీజన్‌లో పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

- కె.క్రాంతి కుమార్, డిప్యూటీ డీఈఈ, శ్రీకాకుళం

విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి

ఎచ్చెర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన విత్తనాల ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయధికారి కె.త్రినాథస్వామి అన్నారు. చిలకపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సరైన యాజమాన్య పద్ధతులు పాటించడంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తనాలు నాటే ముందుకు పచ్చిరొట్ట వేయాలన్నారు. నీటి నిల్వ కుంటల ఆవశ్యకతను వివరించారు. రాగోలు వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ ఉదయబాబు మాట్లాడుతూ.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివిధ రకాల వరి విత్తనాలు, తెగుళ్ల నివారణ తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు హేమ, గాంధీ, ఏడీలు బగ్గు రజని, భవానీ శంకర్, కేవీకే శాస్త్రవేత్త సునీత, ఇన్‌చార్జి వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ చిలక రాము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు నవధాన్యాలను పంపిణీ చేశారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



మఖరాంపురంలో పర్యటిస్తున్న హౌసింగ్ అధికారి

కంచిలి, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ అధికారి జనరల్ మేనేజర్ పి.వెంకటరమణ లబ్ధిదారులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం మఖరాంపురం కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమలరావు, హౌసింగ్ ఏఈ ఆర్.దిలీప్, డిప్యూటీ ఈఈ సత్యాజి, ఈఈలు నర్సింగరావు, అప్పారావు, స్థానిక నాయకులు శోభన్, మాదిన రామారావు, కురయ్య పాల్గొన్నారు.

సినిమా థియేటర్ల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ, మండల పరిధిలో గల రెండు సినిమా థియేటర్లను తహసీల్దార్ ఎస్.వెంకటరావు తనిఖీలు చేశారు. శుక్రవారం ఎంతోటూరు గ్రామంలోని, బోర్డర్ సమీపంలో గల థియేటర్లను సందర్శించి సీట్లు కేటాయింపు, టికెట్ల ధరలు, లైసెన్సులు, పారిశుద్ధ్య నిర్వహణ, తినిబండారాల ధరలపై ఆరా తీశారు. థియేటర్ల లైసెన్సులతో పాటు నిబంధనలు పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌వో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లో బోర్డులు లేకుంటే చర్యలు

లావేరు, మే 30(ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోల్లో వివరాలు తెలిపే బోర్డులు ఉండాలని లేకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.రాజశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం లావేరులోని రేషన్ డిపోను ఆయన తనిఖీ చేశారు. వచ్చే నెల 1 నుంచి రేషన్ డిపోల్లోనే నిత్యావసర సరుకులు అందించాలన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ ఆర్.శ్రీనివాస్, సీనియర్ సహాయకులు రత్నాకర్, డీలర్ ఇజ్జు సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో సానుకూల దృక్పథం పెంపొందించాలి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 30(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-2025, పీఎం సూర్యఘర్ ప్రభుత్వ కార్యక్రమా లపై ప్రజల్లో సానుకూల దృక్పథం పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు. శుక్రవారం ఆయన వివిధ జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో వివిధ కార్యక్రమాల పురోగతిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. జిల్లాలో యోగాంధ్ర-2025 కార్యక్రమాలు గ్రామస్థాయి నుంచి చురుగ్గా జరుగుతున్నాయన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, సీపీవో లక్ష్మీప్రసన్న, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, డీఎంహెచ్‌వో అనిత, డీఈవో తిరుమల చైతన్య, ఆయుష్ కోఆర్డినేటర్ పి.జగదీష్ జిల్లా పర్యాటకాధికారి ఎన్.నారాయణరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి తరానికి అహల్యా బాయి హోల్కర్ ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్ జీ

రణస్థలం, మే 30(ఆంధ్రజ్యోతి): నేటి తరానికి అహల్యా బాయి హోల్కర్ ఆదర్శమని బీజేపీ రాష్ట్ర నాయకుడు మధుకర్ జీ అన్నారు. అహల్యా బాయి జయంతి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మధుకర్ జీ మాట్లాడుతూ.. అహల్యా బాయి పరిపాలన కాలంలో ధార్మిక కార్యక్రమాలు ఎన్నో చేపట్టారన్నారు. మరాఠాలను పరిపాలంచిన మాల్వా సామ్రాజ్యపు హోల్కర్ వంశపు రాణి అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నడుకుదిటి రజిని, టీడీపీ నాయకులు ముప్పిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌పై విచారణ

పొందూరు, మే 30(ఆంధ్రజ్యోతి): పొందూరు తహసీల్దార్ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ సువ్వారి సన్యాసిరావు బాత్‌రూంలో మహిళా ఉద్యోగి వీడియో చిత్రీకరణ ఘటనపై ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ, పొందూరు ఎస్ఐ వి.సత్యనారాయణ శుక్రవారం విచారణ జరిపారు. కేసు దర్యాప్తులో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో మహిళా ఉద్యోగుల నుంచి వివరాలు సేకరించారు. తహసీల్దార్ ఆర్.వెంకటేష్ సమక్షంలో జరిపిన విచారణలో బాధితులు గతంలో సన్యాసిరావు కారణంగా ఎదుర్కొన్న లైంగిక వేధింపులను వివరించారు. బాధితురాలి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఘటనపై నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు.

నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ

కవిటి, మే 30(ఆంధ్రజ్యోతి): జగతి గ్రామంలోని జగదీశ్వర ఆలయం వద్ద నవగ్రహ విగ్రహాలను శుక్రవారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా క్షీరాధివాసం, పంచామృతాభిషేకం, పంచశ య్యాదివాసం, మండప ఆరాధనతో కార్యక్రమాన్ని చేపట్టారు. ధ్వజ స్తంభాన్ని పునఃప్రారంభం చేపట్టారు. యాగశాల సంస్కారం, అఖండ దీపారాధన, అగ్నిప్రతిష్ఠ, జలాధివాసం చేపట్టి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏడు ద్విచక్ర వాహనాల సీజ్

ఆమదాలవలస, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెట్టక్కివలస ప్రాంతంలో శుక్రవారం తెల్లవారు జామున నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో భాగంగా ఎటువంటి పత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సీఐ పి.సత్యనారాయణ ఆమదాలవలస, బూర్జ ఎస్ఐలు బాలరాజు, ప్రవల్లిక ప్రియ తమ సిబ్బందితో విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలను గుర్తించి స్టేషన్‌కు తరలించారు.



ఇచ్ఛాపురం: వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ

- ఇచ్ఛాపురం: సీఐ మీసాల చిన్నమనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పట్టణంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. శుక్రవారం వేకువజాము నుంచే సంతపేట, జర్నలిస్ట్ కాలనీలో గల ప్రతీ ఇంటిని తనిఖీ చేసి, వివరాలు సేకరించారు. ఎటువంటి పత్రాలు లేని వాహనాలకు అపరాద రుసుం విధించారు. అనంతరం వైఎస్ఆర్ కల్యాణ మండపం వద్ద యూత్‌కు అవగహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ముకుందరావు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు, కవిటి ఎస్ఐ రవి పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారం

కంచిలి, మే 30(ఆంధ్రజ్యోతి): భైరిపురం పంచాయతీ పరిధిలో నెలకొన్న లోవోల్టేజీ సమస్యతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమస్యను కూటమి నాయకులు మాదిన రామారావు, పూర్ణచంద్ర బిసాయి తదితరులు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి, వెంటనే గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌లను మార్పించడం జరిగింది. శుక్రవారం జరిగిన పనులను కూటమి నాయకులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు హరిబాబు, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా అందించండి

కంచిలి, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లోపుట్టుగ (సామంతపుట్టుగ)లో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించి, ఆదుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు

ఇచ్ఛాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణించే ప్రయాణికుల రక్షణ కోసం క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అతికిస్తున్నట్టు పట్టణ ఎస్ఐ ముకుందరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలో గల ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు క్యూర్ కోడ్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించి స్టిక్కర్లు అతికించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆటో వివరాలతోపాటు డ్రైవరు వివరాలు కూడా తెలుస్తాయన్నారు. అత్యవసర సమయాల్లో సహాయం పొందవచ్చన్నారు.

నృత్య ప్రదర్శనకు పయనం

ఇచ్ఛాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): శ్రీసాయి నటరాజ ఆర్ట్స్ అకాడమి తిరుపతి వారి ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం రామేశ్వరంలో జరగనున్న నృత్యాంజలి మ్యూజిక్ అండ్ డాన్స్ ఫెస్టివల్-25లో పాల్గొనేందుకు పట్టణానికి చెందిన శ్రీస్వేచ్ఛా నృత్య తరంగణి కూచిపూడి భరతనాట్యం జానపద నాట్య శిక్షణాలయానికి చెందిన కళాకారులు శుక్రవారం పయనమయ్యారు. జూన్1న ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే కార్యక్రమంలో నాట్య ప్రదర్శన ఇస్తారని అకాడమీ అధ్యక్షుడు కె.గోవింద్ తెలిపారు.

రైతులకు అవగాహన

బూర్జ, మే 30(ఆంధ్రజ్యోతి): ఉప్పినివలస గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ సమన్వయంతో వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శుక్రవారం రైతులకు ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పించారు. ఖరీఫ్‌లో రైతులు పాటించాల్సిన అంశాలు, విత్తన రకాల ఎంపిక వాటి లభ్యతపై వివరించారు. ఎంపీటీసీ కె.కృష్ణంనాయుడు, ఉద్యాన శాస్త్రవేత్త పి.అశోక్, పెద్దపేట ఉద్యాన అధికారి అయంతి రైతులకు వివిధ అంశాలపై వివరించారు. అనంతరం గోగు పరిశోధనా స్థానం నుంచి డాక్టర్ శ్రీనివాస్, కట్టెజనుం పంటల గురించి రైతులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్.అనూష, గ్రామ సర్పంచ్ గన్నెరాజు, వాసుదేవ్, డి.వెంకటరమణ, వ్యవసాయ విస్తరణాధికారి దిలీప్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాల ద్వారానే హక్కుల సాధన

అరసవల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవడం సాధ్యపడుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు పేర్కొన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద, డైమండ్ పార్కు వద్ద, రిమ్స్ వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యత, పోరాటం నినాదాలతో 1970 మే 30న సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా విశాల కార్మిక వర్గ ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.మురళి, మునిసిపల్ వర్కర్స్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- ఎచ్చెర్ల, మే 30(ఆంధ్రజ్యోతి): అరిణాం అక్కివలస పరిధిలోని నాగార్జున అగ్రికెమ్, శ్యాంపిస్టన్స్ ఎచ్చెర్లలోని ఏపీ బేవరేజస్ యూనిట్ వద్ద సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎన్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.
- రణస్థలం, మే 30(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులు, సమస్యలు పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరిసాం సమీపంలోని శ్యాంపిస్టన్స్ పరిశ్రమ ఎదురుగా శుక్రవారం యూనియన్ జెండా ఆవిష్కరించారు. జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎం.కూర్మారావు, వెంపడాపు లక్ష్మణరావు, ఎం రమణ, దన్నాన శ్రీరాము తదితరులు పాల్గొన్నారు.
- పొందూరు, మే 30(ఆంధ్రజ్యోతి): దేశంలో వామపక్షాలకు చెందిన కార్మికసంఘాల పోరాటంతోనే కార్మికుల హక్కులను సాధించడం జరిగిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాపాక కూడలిలో జాతీయ జెండా, సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్మిక ఐక్య పోరాటం నినాదంతో 1970లో సీఐటీయూ ఆవిష్కరించిందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య?


ఆత్మహత్యకు పాల్పడిన ప్రవల్లిక

కొత్తూరు, మే 30(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం మహర్తాపురంలో శుక్రవారం వివాహిత నిమ్మక ప్రవల్లిక(26) ఆత్మహత్యకు చేసుకుందని సీఐ సీహెచ్ ప్రసాద్, ఎస్ఐ అమీర్ ఆలీ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం కేదారపురం గ్రామానికి చెందిన నిమ్మక ప్రవల్లికకు భామిని మండలం వడ్డంగి గ్రామానికి చెందిన నిమ్మక సురేష్ కుమార్‌తో నాలుగున్నరేళ్ల కిందట వివాహమైంది. వీరి మధ్య గతంలో తగాదాలు చోటుచేసు కోవడంతో బత్తిలి, గుమ్మలక్ష్మీపురం పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదులున్నాయి. పెద్దలు వారి మధ్య సయోధ్య కుదిర్చారు. బతుకు దెరువు కోసం ప్రైవేటు సెల్ టవర్ కంపెనీలో పనిచేస్తూ కొత్తూరు మండలం మహర్తాపురంలో గత ఆరు నెలలుగా అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. అయితే ఏం జరిగిందో తెలియదు కాని ప్రవల్లిక శుక్రవారం ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. మృతురాలి భర్త సురేష్ కుమార్ సమాచారంతో సీఐ సీహెచ్ ప్రసాద్, ఎస్ఐ అమీర్ ఆలీ ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు కారణాలపై ఆరా తీశారు. ప్రవల్లిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అయితే భార్యభర్తల మధ్య నిత్యం గొడవలు జరిగేవంటూ ప్రవల్లిక మృతిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. క్లూస్ టీమ్‌ను రప్పిస్తున్నట్లు తెలిపారు.

అస్వస్థతకు గురై.. ఉపాధి కూలి మృతి


రామారావు(ఫైల్)

సరుబుజ్జిలి, మే 30(ఆంధ్రజ్యోతి): నందికొండ గ్రామానికి చెందిన ఉపాధి కూలి కొంచాడ రామారావు(49) అస్వస్థతకు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే శుక్రవారం కూడా గ్రామ ఎగువన ఉన్న కొండ ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి పనులకు రామారావు వెళ్లాడు. ఈ క్రమంలో గంట తర్వాత తీవ్ర అస్వస్థతకు గురై పనిచేస్తున్న ప్రాంతం లోనే కుప్పకూలిపోయాడు. తోటి ఉపాధి వేతన దారులు సపర్యలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న ఏపీవో బి.పార్వతి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రామారావు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు సరుబుజ్జిలి హెడ్ కానిస్టేబుల్ టి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పెళ్లికాని కుమార్తెలు ఉన్నారు.

మోసగించాడంటూ బాధితురాలి ఫిర్యాదు

గార, మే 30(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని చెప్పి బందరు వానిపేటకు చెందిన ఎస్.అనిల్ (23) మోసగించాడని మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. తనను నమ్మించి మోసం చేసినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ కేసును డీఎస్పీ దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

ఎచ్చెర్ల, మే 30(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం జంక్షన్‌కు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జి.సిగడాం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎరుగంటి మధు శ్రీకాకుళం నుంచి జి.సిగడాం వెళ్తుండగా.. చిలకపాలెం జంక్షన్‌కు సమీపంలో హైవేపై తన ఆటోను పరిశీలిస్తుండగా.. వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన మధు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాన్నమ్మపై మనుమల దాడి

శ్రీకాకుళం క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): నాన్నమ్మపై మనుమడు, మనుమరాలు దాడి చేసిన ఘటన శుక్రవారం శ్రీకాకుళం నగరంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని పీఎన్ కాలనీ నాయుడుచెరువు గట్టు వద్ద టి.రమణమ్మ అనే వృద్ధురాలు నివాసం ఉంటోంది. పక్కనే ఉంటున్న కుమారుడి పిల్లలైన మనుమడు, మనుమరాలితో బాతురూమ్ నీరు బయటకు వస్తుండడంతో వారిని నిలదీసింది. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో వారిరువురు రమణమ్మపై దాడికి దిగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

కుట్టు శిక్షణతో ఉపాధి

కొత్తూరు, మే 30(ఆంధ్రజ్యోతి): కుట్టుశిక్షణ పొందడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవచ్చని బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ సూచించారు. కొత్తూరులో టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని శనివారం సందర్శించారు. కుట్టు శిక్షణలో మెలకువలు నేర్చుకోవా లన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.నీరజ, వైస్ ఎంపీపీ ఎల్.తులసీ వరప్రసాదరావుపాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

జలుమూరు, మే 30(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని ఎంపీడీవో కె.అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి శుక్రవారం యోగాలో శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజూ యోగాకు కొంత సమయం కేటాయించడం ద్వారా మానసికోల్లాసం పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.రామారావు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఉపాధిహామీ, వెలుగు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● ఎల్.ఎన్.పేట, మే 30(ఆంధ్రజ్యోతి): యోగాసనాలను నిత్యం వేయడం ద్వారా శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సచివాలయ సిబ్బందికి యోగాలో శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి జి.తవిటి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

● పోలాకి, మే 30(ఆంధ్రజ్యోతి): యోగాను ప్రతి ఒక్కరూ సాధన చేయాలని యోగాంధ్ర శిక్షకురాలు ముద్దాడ హైమవతి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందికి యోగాలో శిక్షణ ఇచ్చారు.

చినుకుపడితే అంతే..


గుల్లలపాడు కాలనీ వీధిలో నిలిచిన వర్షపునీరు

వజ్రపుకొత్తూరు, మే 30(ఆంధ్రజ్యోతి): గుల్లలపాడు కాలనీలో ఏమాత్రం వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిలిచిపోతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపునీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో రోజుల తరబడి రోడ్డుపైనే నీరు నిలిచి పోతోందని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల దోమలు ఉత్పత్తి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

జగతిమెట్ట ఇళ్ల కాలనీల్లో అక్రమాలు

● తొమ్మిది మంది అధికారుల సస్పెన్షన్‌కు సిఫారసు ● ఆర్డీవో కృష్ణమూర్తి వెల్లడి


మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, మే 30(ఆంధ్రజ్యోతి): జగతిమెట్ట ఇళ్ల కాలనీల్లో రెవెన్యూ సిబ్బంది తప్పిదాలతో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించామని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం రాత్రి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అక్రమాల చిట్టాను వివరించారు. ఈ కాలనీకి సంబంధించి పత్రికల్లో వస్తున్న కథనాలపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లోతుగా దర్యాప్తు కొనసాగించామన్నారు. టెక్కలి తహసీల్దార్ కార్యాలయంలో అంతులేని తప్పిదాలు జరిగినట్లు గుర్తించామన్నారు. దీనికి బాధ్యులైన ఇద్దరు తహసీల్దార్లు, ఒక ఉప తహసీల్దార్, ఒక ఆర్ఐ, ఒక సర్వేయర్, ముగ్గురు వీఆర్వోలు, ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలకు కలెక్టర్‌కు సిఫారసు చేసినట్లు చెప్పారు. వీరిపై క్రిమినల్ కేసులకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఇళ్ల కాలనీకి సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో ఒక్క రికార్డు కూడా లేదని తెలిపారు. ఇళ్ల పట్టాలు జారీ చేసినప్పుడు పంపిణీ రికార్డు, లబ్ధిదారుల వివరాలు, ఎక్కడెక్కడ కేటాయింపులు జరిగాయి, లేఅవుట్ వివరాలు తెలిపే రికార్డులు లభించలేదని తెలిపారు.

అక్రమంగా చెల్లింపులు

ఇళ్ల కాలనీకి సంబంధించి వాస్తవానికి 30 మంది రైతులకు సంబంధించిన డి.పట్టా భూములను ప్రభుత్వం సేకరించిందన్నారు. కానీ అప్పటి రెవెన్యూ అధికారులు 70 మంది రైతుల నుంచి డి.పట్టా భూములు తీసుకున్నట్లు రికార్డులు చూ పారన్నారు. వీరిలో 56 మందికి చెల్లింపులు చేశారని తెలిపారు. ఇందులో ఒక ఆర్డీవో, తహసీల్దార్ స్థాయి అధికారులు, ఒక మండల సర్వేయర్, ఒక విలేజ్ సర్వేయర్, ఒక వీఆర్వో తప్పిదాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరిలో కొంత మంది రెవెన్యూ అధికారులు 40 మందికి అదనంగా అనధికార పట్టాలు మంజూరు చేశారని తెలి పారు. 16 ఖాళీ స్థలాలు, 14 పునాదులతో ఉన్న స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసు కుంటుందని చెప్పారు. వాస్తవానికి డి.పట్టా ఉన్న రైతులకు ఒక్కో ఇంటి పట్టా జారీ చేయాలన్నారు. కానీ అప్పటి రెవెన్యూ అధికారులు గుంట బాబూరావు పేరున ఆరు పట్టాలు, మట్ట ప్రభాకర్ పేరున మూడు పట్టాలను నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసినట్లు గుర్తించామన్నారు. ఇలా డి.పట్టా భూములు లేని 23మంది రైతులను గుర్తించామని తెలిపారు. డి.పట్టాలు ఇచ్చిన రైతులకు నవరత్నాలు కోటాలో మ్యాపింగ్ చేయాల్సి ఉండగా, 23మంది వివరాలే లేవని తెలిపారు.

ఫోర్జరీ సంతకాలతో...

ఇక జగతిమెట్ట ఇళ్ల కాలనీలో ఆన్‌లైన్‌లో 306 మంది డేటా కనిపించిందని... అందులో 12మంది ఇళ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. 132 మంది ఇళ్లు పునాది స్థాయిలో ఉన్నాయని.. 104 మంది ఇళ్లు కట్టుకున్నారని, శ్లాబ్ లెవల్‌లో 58 ఉన్నట్లు తెలిపారు. పునాది స్థాయిలోని 132 మందిలో ఇతరులకు విక్రయించిన వారే ఎక్కువగా ఉన్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. తహసీల్దార్ ఫోర్జరీ సంతకాలతో ఫేక్ పట్టాలు చాలామంది వద్ద ఉన్నట్లు గుర్తించామన్నారు. ఏకంగా ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్ పట్టా ఒక దగ్గర, మ్యాపింగ్ మరో దగ్గర చేశాడని తెలిపారు. ఇలా ఎన్నో చోట్ల ఈ తరహా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. సుమారు 190 వరకు ఇళ్ల పట్టాలు రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా... 2019కి ముందు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యుల రైజేషన్‌కు డిసెం బరు 31 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆర్డీవో కృష్ణమూర్తి తెలిపారు.

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి


సమీక్షిస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ కరుణాకర్

పాతపట్నం, మే 30(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన దిశగా నిర్దేశిత అభివృద్ధి పనుల లక్ష్యాలను సకాలంలో సాధించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మంచు కరుణాకర్ అన్నారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో శుక్రవారం పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ పాల దిగుబడి సాధించిన పాడి రైతుల వివరాలను భారత పశుధన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నీలినాలుక, జబ్బవాపు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున నియంత్రణ టీకాలను అందుబాటులో ఉంచాలన్నారు. మినీ గోకులాల నిర్మాణాలు, పశుగ్రాసం పెంపకం, పశుదాణా పంపిణీ, డీవార్మింగ్, వ్యాక్సినేషన్లపై సమీక్షించారు. పశు వైద్యాధికారులు పి.అనిల్, బి.శ్రీవాణి, కె.మౌనిక పాల్గొన్నారు.

అన్ని ఆటోలకు క్యూఆర్ కోడ్ తప్పనిసరి


ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అందిస్తున్న సీఐ సూర్యనారాయణ

పలాస, మే 30(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పోలీసు సర్కిల్ పరిధిలో అన్ని ఆటోలకు క్యూఆర్ కోర్ తప్పనిసరిగా అంటించాలని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టికర్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 405 ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అంటించామన్నారు. రెండు, మూడు రోజుల్లో మిగిలిన ఆటోలకు ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఈ క్యూఆర్‌కోడ్ వల్ల మొబైల్ ఫోన్‌లో స్కాన్ చేస్తే సంబంధిత ఆటో, డ్రైవర్ వివరాలు కనిపిస్తాయన్నారు. దీనివల్ల ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నర్సింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలిలో నిరంతర నిఘా


యువతకు సూచనలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి, మే 30(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో నిరంతర నిఘా కొనసాగుతుందని సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి అంబేద్కర్ జంక్షన్‌లో కనిపించిన యువతకు పలు సూచనలు చేశారు. ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వా లన్నారు. మద్యం, గంజాయి వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అన్నారు. బెట్టింగ్‌లు, జూదం ఆడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామంలోనే రేషన్ పంపిణీ చేయాలి

జలుమూరు, మే 30(ఆంధ్రజ్యోతి): జూన్ నెల నుంచి డిపోల్లోనే సరుకులు పంపిణీ చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించినందున మా గ్రామస్థులు లింగాలపాడు రేషన్ డిపోకి వెళ్లి తీసుకోవాల్సి ఉంటుందని, దీనివల్ల ఇబ్బందులు పడనున్నామని వాసుదేవపురం గ్రామస్థులు పేర్కొంటున్నారు. మా గ్రామానికి సంబంధించి లింగాలపాడు రేషన్ డిపోకి సవడాం మీదుగా చల్లవానిపేట కూడలి నుంచి లింగాలపాడు వెళ్లాల్సి ఉంటుందని, సుమారు 6 కిలోమీటర్లు ప్రయాణం చేయాలన్నారు. ఇంతదూరం ప్రయాణించాలంటే ఇబ్బందులు పడాల్సి ఉందని వాపోయారు. గ్రామంలో 70 తెల్ల రేషన్‌కార్డుదారులున్నారని, అందువల్ల మా వాసుదేవపురంలోనే నిత్యావసర సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దీనిపై తహసీల్దార్ జన్ని రామారావును 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా సమస్యను జేసీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

మెట్టూరు విద్యార్థుల ఆత్మీయ కలయిక



వజ్రపుకొత్తూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మెట్టూరు హైస్కూల్‌లో 1995 నుంచి చదువుకున్న గ్రామానికి చెందిన వారంతా శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ కలయిక నిర్వ హించారు. 1995 నుంచి మిత్రులుగా మారిన వారంతా దేశ విదేశాల్లో స్థిర పడ్డారు. గ్రామంలో అమ్మవారి సంబరాల నేపథ్యంలో వచ్చిన నేపథ్యంలో వచ్చిన వారు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందం పొందారు.

క్షీరరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


విగ్రహ పునఃప్రతిష్ఠోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

ఎల్.ఎన్.పేట, మే 30(ఆంధ్రజ్యోతి): కోవిలాం గ్రామంలో క్షీర రామలింగేశ్వరస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠోత్సవంలో భాగంగా శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేదపండితుడు యర్రగుంట్ల సంపత్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి మండప పూజలు, స్వామికి క్షీరాభిషేకం, మహాలింగార్చన చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

పలాసరూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో సీతారామచంద్ర ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రెండురోజులుగా వివిధ పూజలు, హోమం తదితర కార్యక్రమాలు చేపట్టగా శుక్రవారం సీతారామ, లక్ష్మణ, హను మాన్ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అలాగే ధ్వజస్తంభ, యంత్ర, శిఖర ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భజనలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, ఊరేగింపు చేశారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని స్వామిని దర్శిం చుకున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి మందిర ప్రారంభం


వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటం ఊరేగింపు

నందిగాం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మందిర ప్రారంభం, చిత్రపట ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం సందడిగా ప్రారంభమయ్యాయి. వీరబ్రహ్మేంద్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పురోహితులు తమిరె కరుణశ్రీ ఆచారి (కిల్లాం) పర్యవేక్షణలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, అఖండ దీపస్థాపన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం వీరబ్రహ్మేంద్రస్వామి చిత్ర పటాన్ని ఊరేగించారు. శనివారం ప్రతిష్ఠతో పాటు విశేష పూజా కార్యక్రమాలు, అన్నసమారాధన నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

టెక్కలి, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించి నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖా స్తులు ఉచి తంగా కళాశాలలోనే లభ్యమవుతున్నాయని, జూన్ 30 వరకు ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తా మన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో డబుల్ మేజర్ విధానం అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నేడు ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ పర్యటన

నరసన్నపేట, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొరిగివలస, లుకలాం గ్రామంలో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ శనివారం పర్యటించనున్నట్లు ఎంపీడీవో కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించనున్నారని పేర్కొన్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను పరిశీలించి సంబంధిత శాఖాదికారులతో సమీక్షిస్తారన్నారు.

రాయితీపై పశుదాణా

నందిగాం, మే 30(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాయితీపై పశుదాణాను అందిస్తున్నట్లు ఏడీ ఎం.రవికృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నర్సిపురం పశువైద్య కేంద్రంలో 36 బస్తాల పశుదాణాను రైతులకు అందించారు. మండలానికి 157 బస్తాలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పి.అజయ్ కుమార్, డిస్ట్రి బ్యూటరీ కమిటీ చైర్మన్ ఎం.బాలకృష్ణ పశుసంవర్ధకశాఖ అధికారులు ఎస్.జానకిరాం, ఎస్.వైకుంఠ రావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధం కావాలి

నరసన్నపేట, మే 30(ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్ నాటికి రైతులు సన్నద్ధం కావాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. శుక్రవారం 'వికసిత కృషి సంకల్ప అభియాన్' కార్యక్ర మాన్ని మడపాం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాల ఎంపిక, ఎరువులు, సాగు విధానం తదితర అంశాలపై అవగాహన కలిగించారు. వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. అనుబంధ రంగాలైన ఉద్యానవన, పశుపోషణ, కోళ్ల పెంపకం తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవనశాఖ శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, వి.హరికుమార్, ఏవో సునీత తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎండల మల్లన్న కల్యాణం

టెక్కలి, మే 30(ఆంధ్రజ్యోతి): రావివలస ఎండల మల్లికార్జున స్వామి కల్యాణం శనివారం నిర్వహించనున్నట్లు ఈవో జి.గురునాథరావు తెలిపారు. తిరువీధి, సహస్ర ఘటాభిషేకం, భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి కల్యాణం, అన్నదానం నిర్వహించనున్నామన్నారు.

న్యూస్ బాక్స్

నీలమణిదుర్గ ఆలయానికి ఊయల వితరణ

పాతపట్నం, మే 30(ఆంధ్రజ్యోతి): ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణిదుర్గ ఆలయానికి ఒడిశా రాష్ట్రం ఖరగ్‌పూర్ ప్రాంతానికి చెందిన కోన మణికుమార్, పూజ దంపతులు శుక్ర వారం ఊయలను అందించినట్లు ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. సుమారు రూ.30వేలు విలువచేసే ఈ ఊయల పూజా కార్యక్రమాలకు ఉపకరిస్తుందన్నారు.

బాధిత కుటుంబానికి రేషన్ అందజేత

వజ్రపుకొత్తూరు, మే 30(ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పూడిజగన్నాథపురానికి చెందిన జుత్తు నీలమ్మ ఇంట్లోకి వరద నీరు చేరడంతో ఇబ్బందులకు గురయ్యారు. నీటిలో వంట సరుకులు తడిచిపోయాయి. విషయం తెలుసుకున్న హ్యాండ్‌టుగెదర్ ట్రస్టు ప్రతినిధులు బియ్యం, వంటసరుకులు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు ఆదినారాయణ, కోదండరావు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్లు ప్రారంభం

పాతపట్నం, మే 30(ఆంధ్రజ్యోతి): పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో నీటి ఎద్దడి నివారణకు వాటర్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయనున్నట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కొరికాన భవాని అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక నీలమణిదుర్గమ్మ ఆలయం వద్ద ట్యాంకర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు నక్క క్రాంతికుమార్, గంగు వాసు, కర్రి అప్పారావు, వేణుమాధవ్ పొల్లాయి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ మంజూరుపై హర్షం

పాతపట్నం, మే 30(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో రైతుబజార్‌ను మంజూరు చేయడంపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడును విజయవాడలో ఆయన నివాసంలో శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ రైతులకు సాగునీటి సౌకర్యాలు మెరుగుపరిచేలా సహకరించాలని కోరారు.

118 స్పౌజ్ పింఛన్ల మంజూరు

నందిగాం, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన స్పౌజ్ స్కీమ్ కింద మండలానికి 118 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో కుమార్ పట్నాయక్ తెలి పారు. 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య పింఛన్ తీసుకుంటూ మృతి చెందిన భర్త స్థానంలో భార్యకు పింఛన్ ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందించనున్నారు. వీటిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లబ్ధిదారులకు అందించనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

ఒకరోజు ముందుగానే..

జలుమూరు, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఒక రోజు ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు. జూన్ 1న ఆదివారం కావడంతో శనివారం ఉదయం ఇంటింటికి సిబ్బంది వెళ్లి పింఛన్లు అందజేస్తారన్నారు. మండలంలో స్పౌజ్ కేటగిరి కింద కొత్తగా 117 పింఛన్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. మండలంలో 9,310 మందికి రూ.3,89, 19,000 అందించనున్నామన్నారు. స్పౌజ్ కేటగిరి కింద కొత్తగా మంజూరైన వారికి 12న పింఛన్ మొత్తం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

రేపటి నుంచి అమ్మవారి సంబరాలు

వజ్రపుకొత్తూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మెట్టూరులో కొండమహంకాళీ గ్రామదేవత ఉత్స వాలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. అమ్మవారికి చల్లదనం చేయడంతో పాటు పగటి వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మంగళవారం అమ్మవారికి ముర్రాటలతో చల్లదనం చేయడం, మొక్కులు చెల్లించుకోవడంతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో కృషి

కాశీబుగ్గ, మే 30(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం పోరాడేది సీఐటీయూ అని జిల్లా కార్యదర్శి గణపతి అన్నారు. శుక్రవారం కాశీబుగ్గలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. 1970 నుంచి ఇప్పటి వరకు కార్మికులకు అండ దండగా ఉంటూ వారి సమస్యలపై పోరాటం కొనసాగిస్తున్నామన్నారు. జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మురుగన్, రవి, శకుంతల, పద్మ, సంతోష్, గోపి, మోహన్ తదితరులు ఉన్నారు.

నేడు మునిసిపల్ సమావేశం

పలాస, మే 30(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపల్ పాలకవర్గ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ బళ్ల గిరి బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జరుగు సమావేశానికి కౌన్సిలర్లతో పాటు అధికా రులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని కోరారు.